# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# కేంద్ర కమిటీ

**పత్రికా విజ్ఞప్తి**

**10 జనవరి, 2023**

## కామ్రేడ్ ఎల్ఎస్ఎన్ మూర్తి (శ్రీనన్న, శరత్)కు విప్లవ జోహార్లు!



అర్ధ శతాబ్దికి పైగా భారత విప్లవోద్యమం కోసం సాంస్కృతిక, ప్రచురణా, అనువాద రంగాలలో ఎనలేని సేవలు అందించి 76వ యేట అన్నవాహిక క్యాన్సర్ కు చికిత్స పొందుతూ డిసెంబర్ 21వ తేదీన అమరుడయిన కామ్రేడ్ ఎల్ఎస్ఎన్ మూర్తి (శ్రీనన్న, శరత్)కి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ తలవంచి వినమ్రంగా విప్లవ జోహార్లు తెలియజేస్తున్నది. నిర్బంధం వల్ల కామ్రేడ్ మూర్తి అమరత్వం గురించి 20 రోజులు ఆలస్యంగా తెలుసుకున్నాం. కామ్రేడ్ మూర్తి భారత మావోయిస్టు ప్రజాయుద్ధానికి చేసిన సేవల గురించి ప్రచారం చేయవలసిందిగాను, ఆయన ఆశయాలను పరిపూర్తి చేసేందుకు ప్రతిన పూనవలసిందిగానూ కేంద్ర కమిటీ యావత్తు పార్టీ, పీఎల్ జీఏ, ఐక్యసంఘటనా రంగాల నాయకత్వ కమిటీలను, కార్యకర్తలను కోరుతున్నది.

అనారోగ్యంతో కొన్ని సంవత్సరాలుగా భౌతికంగా విప్లవ నిర్మాణానికి దూరంగా ఉన్నప్పటికీ సైద్ధాంతికంగా, భావజాలపరంగా కామ్రేడ్ మూర్తి ఆఖరు వరకు విప్లవాన్నే అంటిపెట్టుకుని ఉన్నారు. జననాట్యమండలి చరిత్ర రచన సందర్భంగా జననాట్యమండలి కళాకారుడు, విప్లవ కార్యకర్త అమరుడు కామ్రేడ్ దప్పు రమేష్ ఆయనను కలిసిప్పుడు, తన విప్లవ కార్యాచరణ గురించి మాట్లాడుతూ, 'విప్లవోద్యమం, దాన్ని నడిపే పార్టీ ఒక సాధారణ వ్యక్తిని విప్లవోద్యమ అవసరాల రీత్యా ఎన్ని రంగాలలో తర్ఫీదిచ్చి ఎన్ని రంగాలలో ఉపయోగపడే లాగా వారికి నైపుణ్యాలను అలవరిస్తుందో అన్నదానికి నేనొక ఉదాహరణ. ఉద్యమ, పార్టీ అవసరాల కోసం పార్టీయే నన్ను తీర్చిదిద్దింది' అన్న వినమ్రమైన విప్లవ కమ్యూనిస్టు కామ్రేడ్ ఎల్ఎస్ఎన్ మూర్తి.

కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ అకౌంట్స్ శాఖలో పూణే, హైదరాబాద్ లలో పని చేసిన కామ్రేడ్ లక్కవరపు సత్యనారాయణ మూర్తిది నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా తెనాలిని ఆనుకుని ఉన్న కఠెవరం గ్రామం. ఆయన తాతయ్య స్వాతంత్ర్య ఉద్యమంలో పని చేయగా తండ్రి కాంగ్రెస్ లో పని చేసేవారు. ఆ రకంగా ఆయనకు రాజకీయాలు పరిచయం అయ్యాయి. పూణేలో ఉద్యోగం చేస్తున్నప్పుడు కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అనే కార్మిక సంఘంలో చేరారు. సహోద్యోగితో కలిసి నగరంలో ఉన్న సీపీఐ పార్టీ కార్యాలయానికి వెళ్లసాగారు. అక్కడే మార్క్సిస్టు రాజకీయాల క్లాసులు విన్నారు. దాంతో మార్క్సిజంపై ఆసక్తి కలిగి మార్క్సిస్టు గ్రంధాలు చదవసాగారు. సీపీఐ రాజకీయాలలో లోపాలను అర్థం చేసుకున్నారు. 1967లో నక్సల్బరీ రైతాంగ సాయుధ తిరుగుబాటు జరిగినప్పుడు ప్రజల మీద కాల్పులు జరిపిన మార్క్సిస్టు పార్టీ రాజకీయాలలో లోపాలను అర్థం చేసుకున్నారు.

నక్సల్బరీ రాజకీయాలను గురించి తెలుసుకోసాగారు. మిత్రుల ద్వారా కొల్లిపర రామనరసింహారావు పరిచయమయ్యారు. కొల్లిపర ద్వారా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) పరిచయమయింది. ఆయన సలహాతో పూణే నుంచి హైదరాబాద్ కు బదిలీ అయ్యి వెళ్లారు.

హైదరాబాద్ లో నక్సల్బరీ రాజకీయాల ప్రేరణతో ప్రజలలో సాహిత్యం ద్వారా ఆ రాజకీయాల ప్రచార కృషి చేస్తున్న ఆర్ట్ లవర్స్ సంస్థ గురించి తెలిసి వారి సభకు వెళ్లి సభ్యులను పరిచయం చేసుకున్నారు. వారితో కలిసి 'గ్రామాలకు తరలండి' కార్యక్రమంలో పాలు పంచుకున్నారు. ఈ క్రమంలో పార్టీతో సంబంధాలు పెంపొందాయి. 1971లో పార్టీలో వృత్తిపర విప్లవకారునిగా అజ్ఞాత జీవితం ప్రారంభించారు.

కామ్రేడ్ మూర్తి కార్మికులలో పని చేసేవారు. వారిలో నక్సల్బరీ రాజకీయాలను ప్రచారం చేసారు. వారి సమస్యలపై పోరాటాలు నిర్మించారు. ఈ పని చేస్తూనే పార్టీ నిర్ణయం మేరకు ఆర్ట్ లవర్స్ సంస్థలో కొందరు సభ్యులతో కలిసి 1972 జులైలో జననాట్యమండలిని నిర్మించారు. కామ్రేడ్ మూర్తే దానికి ఆ పేరు పెట్టారు. 1974 ప్రారంభం నుంచి 1975లో ఎమెర్జెన్సీ విధించే వరకు దానికి బాధ్యులుగా ఉన్నారు. ఆ తరువాత పార్టీ ఆయనను ప్రచురణా రంగానికి బదిలీ చేసింది. ఈ రంగంలోనే కామ్రేడ్ మూర్తి చాలా కాలం పని చేసారు. సాంస్కృతిక రంగం పట్ల ఆసక్తి మాత్రం వదులుకోలేదు. జననాట్యమండలి అభివృద్ధి క్రమంలో ముఖ్య మలుపులలో ఆయన పాత్ర ఉన్నది.

విప్లవ జీవితారంభంలో అప్పటికి కార్యకర్తగా ఉన్న జననాట్యమండలి కళాకారిణిని వివాహం చేసుకున్న కామ్రేడ్ మూర్తి ఆ వివాహం విఫలం అయిన తరువాత తిరిగి చేసుకోలేదు.

1977 నాటికి పార్టీ రాజకీయ పత్రికగా ప్రారంభమయిన 'క్రాంతి' పత్రికకు సంపాదక బాధ్యతలు చేపట్టి అనేక సంవత్సరాల పాటు ప్రచురణ బాధ్యతలు నిర్వహించారు. వివిధ ప్రజాసంఘాల రాష్ట్ర మహాసభల నిర్వహణ బాధ్యతలలో భాగంగా ఉన్నారు. 1982–85 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రావిన్షియల్ కమిటీ సభ్యునిగా కార్మిక రంగ బాధ్యతలు చేపట్టారు. 1995 నుంచి 2000 వరకు దండకారణ్యంలో పని చేసారు. అక్కడ పత్రికా రంగంలో, రాజకీయ శిక్షణలో సేవలు అందించారు.

2001లో నాటి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు–లెనినిస్టు)(పీపుల్స్ వార్) 9వ కాంగ్రెస్–2వ కాంగ్రెస్ లో ప్రతినిధిగా పాల్గొన్నారు. 2001 నుంచి 2004 వరకు ఆంధ్ర రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఉండి తిరిగి కార్మిక రంగంలో బాధ్యతలు నిర్వహించారు. 2005లో పార్టీ ఆయనను పీపుల్స్ మార్చ్ పత్రిక నిర్వహణకు బదిలీ చేసింది.

కామ్రేడ్ మూర్తి గొప్ప అనువాదకుడు. పార్టీ ప్రచురణా రంగంలో పని చేస్తూ మరి కొందరితో కలిసి మావో ఏరిన రచనల సంపుటాలను అనువాదం చేశారు. ఆరో సంపుటం నుంచి 9వ సంపుటం వరకు ఇంగ్లీషు సంపుటాలను ప్రచురించారు. పార్టీ మౌలిక దస్తావేజులను, వివిధ సందర్భాలలో విడుదల చేసిన సర్క్యులర్ లు మొదలయిన వాటిని అనువాదం చేశారు.

పీపుల్స్ మార్చ్ లో పని చేస్తున్నప్పుడు 2009లో అరెస్టయ్యిన కామ్రేడ్ మూర్తి అనేక సంవత్సరాలు రాజమండ్రి జైలులో ఉన్నారు. విడుదల అయిన తరువాత తీవ్ర అనారోగ్యం, వృద్ధాప్యంతో వచ్చే సమస్యలతో వృద్ధాశ్రమంలో ఉన్నారు. ఆయన కోరిక మేరకు ఆయన మరణానంతరం ఆయన శవాన్ని ఉస్మానియా వైద్య కళాశాలకు అందజేశారు.

కామ్రేడ్ మూర్తి నక్సల్బరీ మొదటి తరం నాయకత్వంలో ఆయన ఒక్కరు. నక్సల్బరీ ఉద్యమం సెట్ బ్యాక్ తర్వాత ఆంధ్రప్రదేశ్ లో ఉద్యమ వికాసానికి ఆంధ్ర రాష్ట్ర కమిటీ చేసిన కృషిలో చాలా చురుకుగా పాల్గొన్నారు. ఆ తరువాత సాయుధ పోరాట రాజకీయాలు పెంపొందడానికి దోహదం చేశారు. చివరి వరకు ప్రజాయుద్ధంలో పార్టీ ఇచ్చిన బాధ్యతలలో కొనసాగారు.

కామ్రేడ్ మూర్తి విప్లవానికి అందించిన సేవలు విప్లవ కార్యాచరణలో సుస్థిర స్థానం సంపాదించుకున్నాయి. ఆ ఆదర్శమూర్తి విప్లవ కార్యకర్తల మదిలో ఎల్లకాలం నిలిచి ఉంటారు. ఆయన సుదీర్ఘ విప్లవ జీవితం నుంచి ఆయన అనుభవాల గని నుంచి నేర్చుకోవడానికి విప్లవ శ్రేణులు కృషి చేయాలి.

కామ్రేడ్ ఎల్ఎస్ఎన్ మూర్తికి ఎర్రెర్ర దండాలు!

Abhay

**అభయ్**

**అధికార ప్రతినిధి,**

**కేంద్ర కమిటీ**